DYNAMIC EDITION
# వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 2
గురువారం, నవంబరు 16, 2023
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## కాళేశ్వరం కుంగినట్లే... కేసీఆర్ ప్రభుత్వం కుంగుతుంది



సూర్యాపేట: కాళేశ్వరం కుంగినట్లే...కేసీఆర్ ప్రభుత్వం కుంగుతుందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరామ్ ఎద్దేవ చేశారు. గురువారం నాడు కోదాడ పట్టణంలో కోదండరామ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడుతూ..“ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఒక బలమైన శక్తిగా ఎదుగుతుంది. కమీషన్ల కక్కుర్తితో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు రీ డిజైన్ చేశారు. మూడేళ్లు పూర్తి కాకముందే మేడిగడ్డ కుంగిపోవడం కేసీఆర్ దోపిడీకి నిదర్శనం. రాష్ట్రంలో 1.90 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేసేందుకు కేసీఆర్‌కు సమయం లేదు” అని కోదండరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.




# మౌత్ పబ్లిసిటీ భయంలో గులాబీ

హైదరాబాద్, నవంబర్ 16, (వాయిస్ టుడే): సినిమాల విజయంలో మౌత్ పబ్లిసిటీకి ఒక ప్రత్యేక స్థానం ఉంది. అలాగే ఎన్నికలలో ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే విషయంలో కూడా మౌత్ పబ్లిసిటీ కీలక పాత్ర పోషిస్తుందనీ, గతంలో సంగతి ఎలా ఉన్నా ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో మౌత్ పబ్లిసిటీ ప్రాధాన్యత మరింత పెరిగిందనీ పరిశీలకులు సైతం విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణలో దాదాపు మీడియా అంతా ఏకపక్షంగా మారిపోయిన పరిస్థితులలో మౌత్ పబ్లిసిటీ ప్రజాభిప్రాయం ఎలా ఉందన్న విషయంపై పరిశీలకులే కాదు పార్టీలు కూడా మౌత్ పబ్లిసిటీ మీదే ఆధారపడుతున్నాయి. మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ఇంతగా ప్రతి ఇంటికీ చేరువైన ఈ రోజులలో కూడా ఎన్నికలు, ఫలితాలు మౌత్ పబ్లిసిటీ మీద ఆధారపడి ఉండటం ఏమిటి వింతగా ఉందే అనిపించక మానదు. కానీ వాస్తవ పరిస్థితి మాత్రం అలాగే ఉందని పరిశీలకులు అంటున్నారు.

స్వాతంత్రోద్యమ సమయంలో ఇప్పటిలా మీడియా పెద్దగా ప్రజలకు చేరువగాని సమయంలో ప్రజా ఉద్యమాల నిర్మాణంలో మౌత్ పబ్లిసిటీదే ప్రధాన పాత్రగా ఉండేది. మహాత్మాగాంధీ సహాయనిరాకరణ, విదేశీ వస్తు బహిష్కరణ, దండి సత్యాగ్రహం వంటి ఉద్యమాలకు ఇచ్చిన పిలుపు ఈ మౌత్ పబ్లిసిటీ ద్వారానే జనాలకు చేరిందని చెబుతారు. అప్పట్లో మీడియా పాత్ర పరిమితం. అలాగే అక్షరాస్యత కూడా స్వల్పమే. చదువుకున్న కొద్ది మంది అందుబాటులో ఉన్న వార్తాపత్రికలను చదివి, ఆ విశేషాలను జనాలకు వివరించి చెప్పేవారు. అలా విన్న వారు మరి కొందరికి... విషయం ప్రజలందరికీ చేరేది. ఇందుకు అప్పట్లో వారం నుంచి పది రోజుల సమయం పట్టేదని ఒక అంచనా. అయితే ఇప్పుడు మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా దాదాపుగా అందరికీ అందుబాటులోకి వచ్చేశాయి. అక్షరాస్యులు కూడా గణనీయంగా పెరిగారు. అయితే మీడియాపై విశ్వసనీయత మాత్రం ఏదో ఒక మేరకు సన్నగిల్లింది. అందులో సందేహం లేదు. తెలంగాణ విషయమే తీసుకుంటే.. రాష్ట్రంలో దాదాపు మీడియా అంతా అధికార పార్టీ ప్రచారానికే ఎక్కువ సమయం, స్థలం కేటాయిస్తున్న పరిస్థితి. ప్రధానంగా బీఆర్ఎస్ అధినేత ఇంచుమించు ప్రతి రోజూ మూడు బహిరంగ సభలలో ప్రసంగిస్తుండటంతో ప్రింట్ మీడియాలో కానీ, ఎలక్ట్రానిక్ మీడియాలో కానీ.. ఆయన ప్రసంగానికి సంబంధించిన వార్తే హైలైట్ అవుతోంది. ఇతర పార్టీల ప్రచార కార్యక్రమాలకు కేటాయించే సమయం, స్థలం కూడా తక్కువ అయిపోతోంది. ఈ పరిస్థితుల్లో గ్రౌండ్ రియాలటీపై వాస్తవాలు జనాలకు ఈ మౌత్ పబ్లిసిటీ ద్వారానే తెలుస్తున్నదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇక ఎన్నికల వ్యూహకర్తగా గుర్తింపు పొందిన ప్రశాంత్ కిశోర్ అలియాస్ పీకే కూడా వివిధ రాజకీయ పార్టీల తరపున ఎన్నికల వ్యూహకర్తగా పని చేసిన సందర్భాలలో మీడియాలో ప్రచారం కంటే మౌత్ పబ్లిసిటీకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు చెబుతారు. మీడియా కంటే మౌత్ పబ్లిసిటీ చాలా బలంగా ప్రజలలోకి వెడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేసేవారు. 2019 ఎన్నికల సమయంలో ఆయన ఏపీలో వైసీపీ తరపున పని చేసిన సంగతి విదితమే. అప్పట్లో పింక్ డైమండ్ మాయం, వివేకా హత్య, కోడికత్తి దాడి వంటి అంశాలను అప్పటి తెలుగుదేశం ప్రభుత్వానికి వ్యతిరేకంగా మలచడంలో ఆయన మీడియా కంటే మౌత్ టాక్ ద్వారా వచ్చే ప్రచారంపైనే ఎక్కువగా ఆధారపడ్డారు. అప్పట్లో అది సత్ఫలితాలను ఇచ్చింది కూడా. ఇక ప్రస్తుతానికి వస్తే తెలంగాణలో వాస్తవ ప్రజాభిప్రాయం అంతా మౌత్ టాక్ ద్వారానే వెలుగులోనికి వస్తోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రంలో సామాజిక మాధ్యమం, మౌత్ టాక్ విపక్షాలకు ఒకింత మేలు చేస్తున్నాయనీ, అదే సమయంలో ఎలక్ట్రానిక్ మీడియాలో సింహ బాగం అధికార పార్టీ వార్తల ప్రసారం, ప్రచారానికే పరిమితమైందన్న అభిప్రాయం బలంగా ఉందని చెబుతున్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లు, జనం తరచుగా వెళ్లే బార్బర్ షాపులు, టీ స్టాల్స్, సామాన్యులు ప్రయాణించే సిటీ బస్సులు, మెట్రో రైళ్ల ద్వారా జనాభిప్రాయం ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తూ ఒక బలమైన మాధ్యమంగా మౌత్ టాక్ మారిపోయిందని అంటున్నారు. ఈఈ ప్రదేశాలలో అత్యధికంగా బీఆర్ఎస్ అవినీతి, పోలవరం ప్రాజెక్టు లోపాలు, మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటు వంటి విషయాలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నదనీ, అంతిమంగా ఈ చర్చ అధికార పార్టీకి వ్యతిరేక అభిప్రాయంగా బలపడుతున్న సందర్భాలే ఎక్కువగా ఉంటున్నాయనీ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.



## కేసీఆర్‌కు ఆంధ్రప్రదేశ్ చరిత్ర తెలియదు



హైదరాబాద్ (వాయిస్ టుడే): తెలంగాణతో నాకు 2008 నుంచి అనుబంధం ఉందని కేంద్ర మాజీ మంత్రి చిదంబరం వ్యాఖ్యానించారు. గురువారం నాడు గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ...“కాంగ్రెస్ పార్టీని తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక తెలంగాణ అభివృద్ధి చేసి తీరుతాం. ఆరు గ్యారెంటీ స్కీములను అమలు చేసి తీరుతాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత రాష్ట్ర అభివృద్ధి చూసి అసంతృప్తి కలిగింది. గత పదేళ్లుగా ధరలు, నిరుద్యోగం విపరీతంగా పెరిగాయి. 2013 ధరలతో పోలిస్తే ఇప్పుడు ప్రతి నిత్యావసర వస్తువు ధర పెరిగింది. తెలంగాణలో అర్బన్, రూరల్ నిరుద్యోగం విపరీతంగా పెరిగింది. 2018 ఎన్నికల్లో నిరుద్యోగ భృతి ఇస్తానని బీఆర్ఎస్ ప్రభుత్వం మాట ఇచ్చి మోసం చేసింది. కేసీఆర్ ప్రభుత్వంలో విద్యారంగానికి బడ్జెట్ పూర్తిగా తగ్గించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉద్యోగాలను భర్తీ చేస్తాం. నిత్యావసరాల ధరలు తగ్గిస్తాం. కేసీఆర్‌కి చరిత్ర సరిగా తెలియదు. ఆంధ్రప్రదేశ్ ఎలా ఏర్పడిందో కేసీఆర్ సరిగా చదవలేదు. భాషాప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. రాష్ట్ర ఏర్పాటు సమయంలో కేసీఆర్ ఏం మాట్లాడారో నాకు అంతా గుర్తుంది. శ్రీ కృష్ణ కమిటీ ఇచ్చిన సిఫార్సులన్నీ పక్కన పెట్టి ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేశాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ స్కీములను అమలు చేస్తాం. బడ్జెట్ దృష్టిలో పెట్టుకునే ఆరు గ్యారెంటీ స్కీములు ప్రకటించాం. కేసీఆర్ తనకి వచ్చే పార్లమెంట్ సీట్లతో కేంద్రంలో ఎలా చక్రం తిప్పగలడు” అని చిదంబరం ప్రశ్నించారు.

## తెలంగాణపై చిదంబరం దుష్ప్రచారం చేస్తున్నారు



హైదరాబాద్ (వాయిస్ టుడే): కేంద్ర మాజీమంత్రి చిదంబరం వ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు ఏమన్నారంటే.. “చిదంబరం తీరు చూస్తుంటే హంతకుడే సంతాపం తెలిపినట్టుగా ఉంది. తెలంగాణ ప్రకటన చేసిన చిదంబరం.. దాన్ని వెనక్కి తీసుకున్న ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం రాదనే ఆందోళనతో యువకులు బలిదానం చేశారు. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం గురించి చిదంబరం మాట్లాడటం దొంగే దొంగ అన్నట్టుగా ఉంది. పొట్టి శ్రీరాములు ఆంధ్రా రాష్ట్రం గురించి ఉద్యమించినపుడు కేంద్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా ? అప్పటి నెహ్రూ ప్రభుత్వం తాత్సారం చేయడం వల్లే కదా పొట్టి శ్రీరాములు చనిపోయింది? చరిత్ర తెలియనిది కేసీఆర్‌కి కాదు ..చిదంబరమే చరిత్ర తెలియకుండా వక్ర భాష్యాలు చెబుతున్నారు. అప్పట్లో మద్రాసు రాష్ట్రం ఉండేదని, తెలంగాణ రాష్ట్రం లేదని చిదంబరం మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. హైదరాబాద్ అనేది ఓ రాష్ట్రంగా ఉండేదనే విషయాన్ని ఆయన మరిచిపోతున్నారు. తెలంగాణ అప్పులు, ఆదాయంపై చిదంబరం దుష్ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ ఆర్థిక క్రమశిక్షణ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల కన్నా ఎంతో బాగుందని గ్రహిస్తే మంచిది. తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై ఆర్బీఐ నివేదికలు ఏం చెబుతున్నాయో చిదంబరం తెలుసుకుంటే మంచిది. చిదంబరం ఒక్క ఛాన్స్ ఇవ్వండి అంటే నమ్మేందుకు తెలంగాణ ప్రజలు అమాయకులు కారు. కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఛాన్స్ కాదు పదకొండు సార్లు అవకాశమిచ్చారు. చిదంబరంకు దమ్ముంటే తన సొంత రాష్ట్రం తమిళనాడులో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చే ప్రయత్నం చేయాలి. తెలంగాణ సాధించింది కేసీఆర్, సాధించిన తెలంగాణను అభివృద్ధి చేసి దేశానికే రోల్ మెడల్‌గా నిలిపింది కేసీఆర్. ఎవరు ఎన్ని ట్రిక్కులు చేసినా, ఎంతమంది వచ్చి దుష్ప్రచారం చేసినా.. యావత్ తెలంగాణ ప్రజలు కేసీఆర్ వైపే ఉన్నారు. ఈ ఎన్నికలల్లో బీఆర్ఎస్ పార్టీని దీవించబోతున్నారు” అని మంత్రి హరీశ్‌రావు తెలిపారు.



## రేపు కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల చేయనున్న ఖర్గే

హైదరాబాద్ (వాయిస్ టుడే): రేపు హైదరాబాద్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 10 గంటలకు బెంగుళూరు నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కి ఖర్గే చేరుకొనున్నారు. ఉదయం 11 గంటలకు ఖర్గే గాంధీభవన్‌కు చేరుకుంటారు. 11 గంటలకు కాంగ్రెస్ మేనిఫెస్టో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే విడుదల చేయనున్నారు. సాయంత్రం 4 గంటలకు కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ బహిరంగ సభలో ఖర్గే పాల్గొననున్నారు. సమావేశం అనంతరం హైదరాబాద్ ఓ హొటల్‌లో బస చేసే అవకాశం ఉంది. ఎల్లుండి ఉదయం 10.30 గంటలకు తిరిగి ఖర్గే బెంగుళూరు వెళ్లనున్నారు.

## కాంగ్రెస్.. ధరణిని తీసేస్తే రైతుబంధు ఎలా సాధ్యం

### ఆదిలాబాద్ ప్రజాఆశీర్వాద సభలో కేసీఆర్



ఆదిలాబాద్ (వాయిస్ టుడే): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణిని తీసేస్తామని అంటుంది అలా అయితే రైతు బంధు ఎలా సాధ్యం అవుతుందని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. గురువారం నాడు ఆదిలాబాద్‌లో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడారు. “ధరణితో రైతుబంధు ఇస్తున్నాము. రైతులకు సకాలంలో అకౌంట్లలో పైసలు పడుతున్నాయి. రైతు కష్టం తెలిసిన వాడిని నేను. ధరణితో ప్రజలకు అధికారం ఇచ్చాము. మీ భూమి హక్కును మార్చే శక్తి ముఖ్యమంత్రికి కూడలేదు. మీ బోటనవేలు ముద్ర పడితే భూమి మారుతుంది. ధరణి తీసివేస్తే లంచాల రాజ్యమే. రైతు బంధు కావాలన్నా.. కరెంట్ కావలన్నా బీఆర్ఎస్ పార్టీనే ఈ ఎన్నికల్లో గెలిపించాలి. కాంగ్రెస్ నేతలు చెప్పే మాయమాటలను నమ్మితే గోసపడుతాం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కావాలో.. బీఆర్ఎస్ పార్టీ కావాలో గ్రామాల్లో చర్చించండి. ఓటు వేసే ముందు ఆ పార్టీ చరిత్రను చూడాలి. ఎన్నికలల్లో ప్రజల గెలుపే నిజమైన ప్రజాస్వామ్యం. పేదల సంక్షేమం కోసం బీఆర్ఎస్‌నే గెలిపించాలి” అని పేర్కొన్నారు.

“ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాము. 24 గంటల కరెంట్ ఇస్తున్నాము. దేశంలో ప్రజాస్వామ్య పరిణితి రాలేదు. ఓటు ఆయుధం.. ఈ ఆయుధాన్ని ఈ ఎన్నికల్లో జాగ్రత్తగా వాడాలి. అభ్యర్థులను చూసి ఆలోచించి ఓటు వేయాలి. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మూడు గంటలే కరెంట్ ఇస్తామంటున్నారు. చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చినా. కేంద్రప్రభుత్వం మెడికల్, నవోదయ కళాశాలలను ఒక్కటి కూడా ఇవ్వలేదు. బీజేపీకి ఈ ఎన్నికల్లో ఒక్క ఓటు వేయొద్దు. బీజేపీ పార్టీకి ఓటు వేస్తే మోరిలో వేసినట్లే. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఈ ఎన్నికల్లో మెజారిటీ రాదు. రాబోయే రోజుల్లో ప్రాంతీయ పార్టీల అధిపత్యం కొనసాగుతుంది” అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.



## 18న బీజేపీ మేనిఫెస్టో విడుదల

హైదరాబాద్ (వాయిస్ టుడే): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ బీజేపీ దూకుడు పెంచింది. కేంద్ర అగ్ర నాయకులతో రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం చేసేలా పలు ప్రణాళికలను రచించింది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హొంమంత్రి అమిత్ షాలను తెలంగాణలో పర్యటించేలా పలు పథకాలు రెడీ చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హొంమంత్రి అమిత్ షాలు రాష్ట్రంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించేలా ప్లాన్ చేసింది. 18వ తేదీన ఉదయం 9గంటలకు అమిత్ షా బీజేపీ మేనిఫెస్టోను విడుదల చేస్తారు. అనంతరం గద్వాల, ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో ఎన్నికల సభల్లో అమిత్ షా పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం ఎమార్పీఎస్ నేతలతో అమిత్ షా భేటీ అవుతారు. అమిత్ షాతో సమావేశంలో మంద కృష్ణమాదిగ పాల్గొంటారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించే అవకాశం ఉంది.

# కోనప్పకు ప్రవీణ్ గండం...





అదిలాబాద్, నవంబర్ 16, (వాయిస్ టుడే): తెలంగాణలో అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకటో నంబర్ నియోజకవర్గం సిర్పూర్.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఈ నియోజకవర్గానికి ప్రస్తుతం కోనేరు కోనప్ప ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014 నుంచి ఆయనే ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈసారి కూడా గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్నారు. కానీ, ఈసారి గెలుపు ఆయనకు నల్లేరు మీద నడక కాదంటున్నారు విశ్లేషకులు. మాజీ ఐపీఎస్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ రాజకీయాల్లో వచ్చి బీఎస్పీలో చేరారు. ఆయన సిర్పూర్ నియోజకవర్గంపై కన్నేశారు. రాష్ట్రంలో బీఎస్పీ బలంగా ఉన్న నియోజకవర్గం ఏదైనా ఉందా అంటే అది సిర్పూర్ అని చెప్పవచ్చు.దాదాపు ఏడాదిగా ఆర్ఎస్.ప్రమీణ్‌కుమార్ ఇక్కడ పనిచేస్తున్నారు. 2023లో ఇక్కడ గెలిచి తెలంగాణలో బీఎస్పీ బోణీ కొట్టాలని శ్రమిస్తున్నారు. ఆర్ఎస్పీ పనితీరు, ఆయన విజన్‌కు ఆకర్షితులై అనేక మంది ఇతర పార్టీల నేతలు బీఎస్పీలో చేరారు. దీంతో తనకు తిరుగు లేదనుకున్న కోనప్పకు టెన్షన్ మొదలైంది. అధికార పార్టీకి చెందిన నాయకులు, ఎమ్మెల్యే వైఖరి నచ్చని నాయకులు గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పి బీఎస్పీలో చేరారు. ఇది నచ్చని కోనప్ప తన గూండా రాజకీయానికి తెరలేపారన్న అభిప్రాయం స్థానికంగా వ్యక్తమవుతోంది.తాజాగా నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. దీంతో ప్రచారంలో అధికార బీఆర్ఎస్‌కు దీటుగా ఆర్ఎస్.ప్రమీణ్‌కుమార్ దూసుకుపోతున్నారు. ఎక్కడా తగ్గేదేలే అన్నట్లుగా పల్లెలను చుట్టేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో సెటిలర్లు, గిరిజనులు, దళితులు ఎక్కువ. వీరి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కోనప్ప అటవీ భూములను కబ్జా చేస్తూ అన్నదానం నిర్వహిస్తున్నారని అవగాహన కల్పిస్తున్నారు. ఓటర్లను చైతన్యవంతం చేస్తున్నారు. గిరిజనులు చదువుకోవాలని, పేదరికం దూకం కావాలంటే, వ్యాధులు దూరం కావాలంటే బడి, ఆస్పత్రి రావాలని పేర్కొంటున్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన ఆర్ఎస్పీ.. ఇక్కడి గిరిజనులు, దళిత ఓటర్లతోపాటు సిర్పూర్ పేపర్‌మిల్‌లో పనిచేస్తున్న వలస కార్మిక కుటుంబాలు, బెంగాలీ కుటుంబాలు తనకు మద్దతు ఇస్తారని లెక్కలు వేస్తున్నారు. బీఆర్ఎస్ సర్వేలో కూడా ఓటరు తీరు మారుతోందని, మార్పు కోరుకుంటున్నారని తేలింది. దీంతో తన పార్టీ నుంచి బీఎస్పీలో చేరినవారిపై కోనప్ప దాడులకు ఉసిగొొప్పులుతున్నారు.ఐసీఎస్ అయిన ఆర్ఎస్పీ.. కోనప్ప దాడులను ధైర్యంగా ఎదుర్కొంటున్నారు. కోనప్ప అవినీతి, అరాచక సామ్రాజ్యాన్ని కూల్చడమే లక్ష్యం అంటూ పనిచేస్తున్నారు. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న పోలీసులను సైతం ఎండగడుతున్నారు. ఎస్పీ లక్ష్యంగా ఆరోపణలు చేస్తున్నారు. ఎస్పీకి, కోనప్పకు ఉన్న అనుబంధాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.

## ఈ ఎన్నికల్లో తెలంగాణలో రికార్డు బ్రేక్ చేస్తాం



జగిత్యాల జిల్లా (వాయిస్ టుడే): దక్షిణ భారతదేశంలో మూడు సార్లు ముఖ్యమంత్రి ఎవరు కాలేదని ఆ రికార్డును తెలంగాణలో మేము బ్రేక్ చేస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం నాడు కోరుట్ల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్ షో లో కవిత పాల్గొని మాట్లాడుతూ..."చెరువులో చేపలలాంటి వాళ్లం మేము.. కప్పల లాంటి వాళ్లు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు. మర్యాద లేని వాళ్లు ప్రతిపక్షాలు. హనుమంతుని గుడి లేని ఊరు లేదు, కేసీఆర్ పథకం లేని ఇళ్లు లేదు" అని కవిత పేర్కొన్నారు.

## మణుగూరులో రాహుల్ రోడ్‌షోకు భారీ ఏర్పాట్లు



మణుగూరు(భద్రాద్రి కొత్తగూడెం): అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ శుక్రవారం మణుగూరుకు రానున్నారు. సీపీఐ బలపర్చిన పినపాక కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన రోడ్‌షో, స్ట్రీట్ మీటింగ్‌ల్లో పాల్గొనబోతున్నారు. ఈ మేరకు మణుగూరులోని కాంగ్రెస్ కార్యాలయంలో పాయం వెంకటేశ్వర్లు, సీపీఐ రాష్ట్ర నేత బీ అయోధ్య, డీసీసీబీ డైరక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించి రాహుల్ పర్యటన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ పినపాకతో పాటు ఉమ్మడిజిల్లాల్లో కాంగ్రెస్ విజయం కోసం రాహుల్ ప్రచారం చేయబోతున్నారని, శుక్రవారం ఉదయం 10గంటలకు మణుగూరులో రోడ్ షో, ఆ తర్వాత స్ట్రీట్‌మీటింగ్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, సీపీఐ శ్రేణులు, నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తొలిసారి ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న రాహుల్ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## కాంగ్రెస్ ఒళ్ల మాటలు నమ్మితే అగమైపోతము..

వికారాబాద్ జిల్లా (వాయిస్ టుడే): మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన వికారాబాద్‌లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఎవరైనా చనిపోతే కరెంటు కావాలంటే బ్రతిమలాడే పరిస్థితి ఉండేదని, కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు ఉండేవని, తాగునీరు, సాగునీరు లేదని ఆరోపించారు. ఆనాడు కాంగ్రెస్ వాళ్ళు అడ్డుపడ్డందుకు ఈ ప్రాంతానికి వచ్చే నీళ్ళు రాలేదన్నారు. 55 ఏళ్ళ పాలనలో జరగనిది.. ఇప్పుడు ఈ కాంగ్రెసు వాళ్ళు ఎలా చేస్తారని ప్రశ్నించారు.

తెలంగాణలో మూడేకరాల రైతులే ఉన్నారని, మూడు గంటల కరెంట్ చాలని, 10 హెచ్‌బీ మోటార్ పెట్టి గుంజుడు గుంజితే చాలని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని.. మరి 10 హెచ్‌బీ మోటార్లు రైతుల వద్ద ఉన్నాయా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఒళ్ల మాటలు నమ్మితే అగమైపోతమని.. మన రాష్ట్రాన్ని దొంగల చేతిలో పెడదామా? అని ప్రశ్నించారు. కరెంట్ కావాలా?... కాంగ్రెస్ కావాలా?... ఈ ప్రాంత రైతులు ఆలోచించాలన్నారు. కాంగ్రెస్ ఉన్నప్పుడు వృద్ధుల పెన్షన్ రూ. 2 వందలని, కేసీఆర్ ప్రభుత్వంలో రూ 2వేలని.. ఇప్పుడు మళ్ళీ గెలిస్తే రూ. 4 వేలు ఇస్తామని కేటీఆర్ అన్నారు. 'అభివృద్ధి మా కులం, సంక్షేమం మా మతం'.... కులాలు, మతాలు, ప్రాంతాలు మనకొద్దు... అభివృద్ధి కావాలంటే మళ్ళీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని, మళ్ళీ ఆ పాత రోజులు మనకొద్దని అన్నారు.

సంవత్సరం లోపు పాలమూరు రంగారెడ్డి ద్వారా కృష్ణా జలాలు తెచ్చి ఈ ప్రాంతం సస్యశ్యామలం చేస్తామని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడగానే తెల్ల రేషన్ కార్డు ఉన్న అందరికీ కేసీఆర్ ధీమా పేరుతో భీమా ఇస్తామన్నారు. సౌభాగ్య లక్ష్మీ ద్వారా అర్హులైన ప్రతి మహిళకు 3 వేల రూపాయలు, ప్రతి ఇంటికి సన్న బియ్యం... ఆరోగ్య శ్రీ ద్వారా 15 లక్షల ఆర్థిక సాయం, అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు కల్పిస్తామన్నారు. రైతు బంధు ద్వారా 73 లక్షల రైతులకు సాయం..., 5 లక్షల రైతు భీమ కల్పిస్తామన్నారు. 1043 తాండాలను ఈ ప్రాంతంలో గ్రామపంచాతీలను ఏర్పాటు చేశామని, డిల్లీ నుంచి రాహుల్ గాంధీ వచ్చి బీఆర్ఎస్, బీజేపీకీ బీటీం అంటారని, మేం బీటీం ఎట్లయితమో చెప్పాలన్నారు. మంచిగా చదువుకున్నోడు మన ఆనందునే గెలిపించాలని సూచించారు. ఈ నెల 30న కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేయాలని మంత్రి కేటీఆర్ పిలుపిచ్చారు.

# రెంటికి చెడ్డ షర్మిళ



హైదరాబాద్, నవంబర్ 16, (వాయిస్ టుడే): ఆమె ఓ మాజీ ముఖ్యమంత్రి బిడ్డ.. ప్రస్తుత ముఖ్యమంత్రి చెల్లి.. రాజకీయం ఆమెకు వెన్నతో ఎట్టిన ముద్ద. ఇదీ మొన్నటి వరకు షర్మిలపై ఉన్న అభిప్రాయం. కానీ ఇప్పుడు రాజకీయాల్లో ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదో షర్మిలను చూస్తే అర్థమవుతుందని తెలంగాణ రాజకీయ నేతలు జాలి చూపిస్తున్నారు. కాంగ్రెస్ అడగకపోయినా మద్దతు ప్రకటించి ఎన్నికల బరి నుంచి వైదొలిగారు. ఇందుకు ఆమెకు కనీసం ఆ పార్టీ కృతజ్ఞతలు కూడా చెప్పలేదు. తనను కొన్ని చోట్ల అయినా ప్రచారానికి పిలుస్తారని ఆమె ఆశపడ్డారు. అసలు షర్మిల ప్రస్తావన తీసుకు రావడానికి కూడా కాంగ్రెస్ నేతలు అంగీకరించడం లేదు. ఇంకా చెప్పాలంటే అసలు వైఎస్ ప్రస్తావన వద్దనుకుంటున్నారు. వైఎస్‌పై తెలంగాణలో వ్యతిరేకత ఉందని ఆయన వల్ల కాంగ్రెస్‌కు నష్టమే కానీ.. మేలు ఉండదని అనుకుంటున్నారు. మరోవైపు షర్మిల తీసుకున్న నిర్ణయం బూమరాంగ్ అయిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటు కాంగ్రెస్ ఆదరించకపోగా, అటు సొంత పార్టీ లీడర్లు పార్టీని వీడారు.

రేవంత్‌రెడ్డి వైఎస్సార్‌ను కీర్తించడానికి అంగీకరించడం లేదు. ఓ జాతీయ టీవీ చానల్ చర్చలో పాల్గొన్నప్పుడు.. వైఎస్‌ను గొప్పగా చెప్పడాన్ని అంగీకరించలేదు. ఆయనొక్కరే కాదని చంద్రబాబు, జైపాల్‌రెడ్డి, పీవీలు కూడా గొప్పేనని స్పష్టం చేశారు. వైఎస్ తెలంగాణను వ్యతిరేకించారని.. అవమానించారన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. పైగా షర్మిల తన పాదయాత్రలో ప్రచారం కోసం ఇష్టం వచ్చినట్లుగా అందర్నీ తిట్టారు. ఇది కూడా వివాదాస్పదమయింది. ఇప్పుడు షర్మిల నీడ కాంగ్రెస్‌పై పడితే.. అది తమకే నష్టమని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. అందుకే మద్దతు ప్రకటించినా కనీసం కృతజ్ఞతలు చెప్పడం లేదు. ప్రచారం చేయాలని అడగడం లేదుఇదిలా ఉంటే.. కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాత్రం షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె నిర్ణయం మంచిదని అభినందించారు. కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం మంచి నిర్ణయం అని ఓ టీవీ చానెల్‌లో పేర్కొన్నారు. మిగతా నేతలెవరూ షర్మిల మద్దతుపై కనీసం స్పందించడం లేదు. దీంతో కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించకుండా ఎన్నికల బరి నుంచి వైదొలిగినా షర్మిలకు కాస్త గౌరవం ఉండేదని ఇప్పుడు ఏదీ లేకుండాపోయిందని ఆమె అభిమానులు బాధపడుతున్నారు.

## నల్లగొండ జిల్లాలో ఐటీ దాడులు కలకలం

నల్లగొండ నవంబర్ 16 (వాయిస్ టుడే): నల్లగొండ జిల్లాలో ఐటీ దాడులు కలకలం సృష్టిస్తున్నాయి. నల్లగొండ, మిర్యాలగూడ, హైదరాబాద్‌లో 40 చోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. మిర్యాలగూడలోని వైదేహీ వెంచర్స్‌తోపాటు రైస్‌మిల్ యజమానులు రంగా శ్రీధర్, రంగా రంజిత్, బండారు కుశలయ్య ఇండ్లలో సోదాలు చేస్తున్నారు. గురువారం ఉదయం 4 గంటల నుంచి ఈ దాడులు కొనసాగుతున్నాయి. ఒక్క నల్లగొండలోనే 30 బృందాలు తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తున్నది.

## పోలీసుల తనిఖీలలో బయటపడ్డ రూ.50 లక్షలు

### నగదుతోపాటు రెండు మొబైల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం

హైదరాబాద్ నవంబర్ 16 (వాయిస్ టుడే): పోలింగ్ తేదీ సమీపిస్తుండంతో పార్టీలు ప్రచారాన్ని ముమ్మరంచేశాయి. దీనికితోడు ప్రలోభాలకు కూడా తెరలేపాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీధర్ బాబు ఫొటోతో ఉన్న గోడగడియారాలు మంథనిలో పట్టుబడగా, హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో అదే పార్టీకి చెందిన చెన్నూరు అభ్యర్థి గడ్డం వివేక్‌కు చెందిన నగదును పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఉదయం రామంతాపూర్‌లో పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని ఆపారు. వారివద్ద బ్యాగ్‌లో చూడగా రూ.50 లక్షలు బయటపడ్డాయి. వారిని ముదిగంటి ప్రేమ్ కుమార్, కంజుల రవి కిషోర్‌గా గుర్తించారు.ప్రేమ్ కుమార్ చెన్నూరు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ చెందిన దిన పత్రికలో మార్కెటింగ్ విభాగంలో పనిచేస్తుండగా, రవి కిషోర్ విశాఖ ఇండస్ట్రీస్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్ అని తేలింది. తమ ఓనర్ వివేక్ ఆదేశాల మేరకు చెన్నూరు నియోజకవర్గంలో ఎన్నికల ఖర్చుల నిమిత్తం డబ్బును తరలిస్తున్నామని నిందితులు ఒప్పుకున్నారు. ఈ మేరకు వారిపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదుచేశారు. వారి నుంచి నగదుతోపాటు రెండు మొబైల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్?ను స్వాధీనం చేసుకున్నారు.

## బోడుప్పల్‌లో మల్లారెడ్డికి షాక్

### హస్తం గూటికి బీఆర్ఎస్ ఐదుగురు కార్పొరేటర్లు
### రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



హైదరాబాద్ (వాయిస్ టుడే): బోడుప్పాల్ లో బీఆర్ఎస్ అభ్యర్ధి, మంత్రి మల్లారెడ్డికి షాక్ తాకింది. బీఆర్ఎస్ కు చెందిన ఐదుగురు కార్పొరేటర్లు ఎన్నికల వేళ కాంగ్రెస్ గూటికి చేరారు. 23 డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్, ఒకటవ డివిజన్ కార్పోరేటర్ బింగి జంగయ్య యాదవ్,13 వ డివిజన్ కార్పోరేటర్ దానగళ్ల అనితా-యాదగిరి, 20 వ డివిజన్ కార్పోరేటర్ జడిగే మహేందర్ యాదవ్,24 వ డివిజన్ కార్పోరేటర్ గుర్రాల రమా వెంకటేష్ యాదవ్ గురువారం నాడు టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు.ద

## తెలంగాణ తెచ్చుకుంది కేసీఆర్ దోచుకోడానికేనా?



ఖమ్మం జిల్లా (వాయిస్ టుడే): పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీఎం కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన తిరుమలాయపాలెం మండలం, పైనంపల్లి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రెండు సార్లు ప్రజలు కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేశారని, తొమ్మిదేళ్లలో ఆయన తెలంగాణకు ఏం చేశారని ప్రశ్నించారు. తెలంగాణ తెచ్చుకుంది కేసీఆర్ దోచుకోడానికేనా? అన్నట్లుగా ముఖ్యమంత్రి నడవడిక ఉందని అన్నారు.

ఈనాటి పరిస్థితి చూస్తుంటే తెలంగాణా ప్రజల ఆత్మ గౌరవన్నీ మనందరం కేసీఆర్‌కు తాకట్టు పెట్టినట్లు ఉందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఇళ్ళు, రేషన్ కార్డులు ఏవీ ఇవ్వలేదని, ఈ ఎన్నికల్లో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ప్రజలు ఫామ్ హౌస్‌కే పరిమితం చేయాలని పిలుపిచ్చారు. డిసెంబర్ 9న కాంగ్రెస్ నాయకుడే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. భూమిలేని పేదలకు సంవత్సరానికి రూ. 12 వేలు ఇస్తామని, ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు కరెంటు ఉచితంగా ఇస్తామని అన్నారు. ఇన్ని మంచి కార్యక్రమాలు కావాలంటే.. హస్తం గుర్తుపై ఓటేసి ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకోవాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపిచ్చారు.

## ఢిల్లీలో విపరీతంగా పెరుగుతున్న వాయుకాలుష్యం



న్యూ డిల్లీ నవంబర్ 16: దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం విపరీతంగా పెరుగుతున్నది. దీపావళి తర్వాత జాతీయ రాజధాని కాలుష్యం తారాస్థాయికి చేరింది. నగరంలో ఎక్కడ చూసినా దట్టంగా పొగమంచు పేరుకుపోతున్నది. దీంతో ప్రజలు శ్వాస తీసుకొనేందుకు ఇబ్బందులుపడుతున్నారు. చలికాలంలో వాయు కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రభుత్వంతో పాటు వివిధ ఏజెన్సీలు విఫలమవుతున్నాయి. ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ గురువారం ఉదయం తీవ్రమైన కేటగిరిలోనే నమోదైంది.జహంగీర్‌పురాలో ఉదయం 8 గంటల ప్రాంతంలో ఏక్యూఐ సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ పేర్కొంది. అలాగే ఆనంద్ విహార్‌లో 453, నరేలాలో 482, పంజాబీ బాగ్‌లో 481, ఆర్‌కేపురంలో 430 నమోదైనట్లు తెలిపింది. రోజురోజుకు గాలి నాణ్యత క్షీణిస్తుండడంతో ప్రజలు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులుపడుతున్నారు. అయితే, శనివారం వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ (%××ువీ%) ప్రకారం.. బుధవారం ఉత్తర దిశ నుంచి గంటకు నాలుగు కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. గాలి వేగం తగ్గడంతో కాలుష్యం పెరిగింది. గురువారం తూర్పు దిశ నుంచి గాలులు వచే అవకాశాలున్నాయని పేర్కొంది. ఉదయం సమయంలో భారీగా పొగమంచు పేరుకుపోతుందని అంచనా వేసింది. శుక్రవారం ఉత్తర, వాయువ్య దిశల నుంచి గాలులు వీస్తాయని, గంటకు 4 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశాలున్నాయని పేర్కొంది.